
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM

శుక్రవారం, 6 సెప్టెంబరు 2024 | 5



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం...

నిరాశ్రయులైన వారు ఆందోళన చెందవద్దు

- మెరక ప్రాంతానికి స్వచ్ఛందంగా వచ్చే వారికి ప్రాధాన్యం
- బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- నగరంలో మున్నేరు బాధితులకు పరామర్శ
- ఇంటింటికీ నిత్యావసరాల పంపిణీ

రైతులకు అండగా ఉంటాం

- సర్వే పూర్తయిన తరువాత పరిహారం పంపిణీ: మంత్రి తుమ్మల
- మధిర, ఎర్రుపాలెం మండలంలో దెబ్బతిన్న పంటల పరిశీలన

వివరాలు : 6లో

నేడు కేంద్రమంత్రుల రాక

- చౌహాన్, బండి సంజయ్‌ల పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- ఖమ్మం జిల్లాలో వరదనష్టంపై పరిశీలన





ఖమ్మం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో మున్నేరు వరదతో పాటు భారీవర్షాల వల్ల కలిగిన నష్టాన్ని పరిశీలించేందుకు శుక్రవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తదితరులు ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి చౌహాన్, కేంద్రహోం శాఖ సహాయమంత్రి బండిసంజయ్ శుక్రవారం ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పర్యటించనున్నారు. ఏరియల్ సర్వే ద్వారా వరదనష్టాన్ని పరిశీలించి, పాలేరు వద్ద సాగర్ ఎడమకాలువకు పడ్డ గండిని పరిశీలిస్తారు. జుజ్జుల్‌రావుపేటలో వరదల వల్ల నష్టపోయిన పంటపొలాలను తిలకించి, అనంతరం ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. అధికారులు, రైతులతో మాట్లాడుతారు. అనంతరం కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ తిరిగి ప్రయాణం కానున్నారు. కేంద్ర హోంశాఖమంత్రి బండి సంజయ్ ఖమ్మంలో మున్నేరు వరదల వల్ల నష్టపోయిన కుటుంబాలను పరామర్శించనున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ నివాసంలో భోజనం చేసి ధంసలాపురంలో వరద బాధితులకు ఏర్పాటుచేసిన బిలీఫ్ ఆస్పత్రి మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తారు. అక్కడినుంచి సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారు. కేంద్రమంత్రుల పర్యటనలో జిల్లాకు చెందిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి హాజరుకానున్నారు.

మున్నేరు వరద తాకిడితో అతలాకుతలమైన ఖమ్మం నగరం క్రమంగా కోలుకుంటోంది. వరద బీభత్సానికి లోనైన జిల్లాలోని ఇతర ముంపు గ్రామాలు కూడా కుదుట పడుతున్నాయి. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఆయా డివిజన్లు, గ్రామాలలో సహాయక చర్యలను ముమ్మరంగా సాగిస్తున్నారు. ఖమ్మం నగరంతోపాటు జిల్లాలో సుమారు 15వేల కుటుంబాలు నష్టపోయినట్టు ప్రాథమిక అంచనా. 10వేల వరకు ఖమ్మంలోనే ఉన్నాయి. గురువారం సుమారు 15 వేల కిట్లు వరద బాధితులకు అందించారు. 10వేల దుస్తుల కిట్లు కూడా అందించారు. ఇంకా 10 వేల కిట్ల వరకు పంపిణీ చేసే అవకాశం ఉంది. ఇంటింటికీ సర్వే 70శాతం పూర్తయింది.



బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

జోరుగా... సహాయక చర్యలు

వరద కష్టాల నుంచి కోలుకుంటున్న ఖమ్మం నగరం

- బాధితులకు అండగా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు
- నిత్యావసరాలు, దుస్తులు, భోజనాల పంపిణీ
- ఆర్థిక సహాయం అందించేందుకు కొనసాగుతున్న ఇంటింటి సర్వే
- బాధితుల ఖాతాల్లోకి నేటినుంచి రూ.10వేల నగదు జమ
- కరెంటు, తాగునీటి సరఫరా పునరుద్ధరణ
- డ్రైనేజీలు, రోడ్లపై బురద తొలగింపు
- ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి
- మొత్తం 15 వేల కుటుంబాలు నష్టపోయినట్టు అంచనా
- భోజనాలు అందజేస్తున్న సేవాసంస్థలు
- పలుచోట్ల బురద కష్టాలతో తల్లడిల్లుతున్న బాధితులు

ఖమ్మం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముంపునకు గురైన ఇళ్లకు వెళ్లి అధికారులే నేరుగా కుటుంబ వివరాలు సేకరిస్తున్నారు. వారి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నెంబరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తీసుకుంటున్నారు. ఈ సర్వే ఆధారంగా ఇంటింటికి నిత్యావసర, దుస్తుల కిట్లు అందిస్తుండగా.. శుక్రవారం నుంచి రూ.10వేలు తక్షణ సహాయం కూడా బాధితుల ఖాతాల్లో పడనుంది. కాగా ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లో వరదతో దెబ్బతిన్న కాలనీలు, ఇళ్లలో పారిశుధ్య కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయి. జేసీబీలు ట్రాక్టర్ల ద్వారా శుభ్రం చేయిస్తున్నారు. పలు జిల్లాలనుంచి వచ్చిన వెయ్యిమంది పారిశుధ్య సిబ్బంది బురద, చెత్త తొలగింపు, రోడ్లు ఊడ్చే పనుల్లో నిమగ్నమయ్యారు.



వరద బాధితులకు రగ్గులు అందజేస్తున్న చినజీయర్ స్వామి

విద్యుత్‌శాఖ 90 శాతం విద్యుదీకరణ పనులు పూర్తిచేయగా.. వైద్య, ఆరోగ్య శాఖ.. వైద్యబృందాలతో సేవలందిస్తోంది. తాగునీటి సరఫరా పునరుద్ధరించి మంచినీరు అందిస్తున్నారు. ఖమ్మం నగరంలో వరద ముంపునకు గురైన కాలనీల్లో సగానికిపైగా కోలుకోగా, ఇంకా మున్నేరు అటు ఇటు ఉన్న కాలనీల్లో ఇళ్లు బురదలోనే ఉన్నాయి. వాటిని కూడా శుభ్రం చేసుకుంటున్నారు. వరద తగ్గిన ఇళ్లకు బాధితులు చేరుకుని తిరిగి జీవనాన్ని సాగిస్తున్నారు. బురద, తేమ ఉన్న ఇళ్లు శుభ్రం చేసుకుంటూ పునరావాస కేంద్రాల్లో ఉంటున్నారు. కార్పొరేషన్‌తోపాటు పలు సేవా సంస్థలు భోజనాలు అందిస్తున్నాయి.

మంత్రుల పర్యవేక్షణ

వరద ముంపు గురైన నాటినుంచి ఖమ్మంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గాల్లోనే ఉంటూ సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. ఖమ్మంలో ధ్వంసమైన ప్రాంతాలను మళ్లీ పూర్వస్థితికి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇతర జిల్లాలనుంచి పారిశుధ్య, ట్రాన్స్‌కో, హెల్త్‌తోపాటు పలు శాఖల సిబ్బందిని రప్పించి విద్యుత్ పునరుద్ధరణ, మంచి నీటి సరఫరా, పారిశుధ్యం వేగవంతం జరిగేలా కార్యక్రమాలు చేపట్టగలిగారు. ఈ చర్యలతో వరదముపు కాలనీల్లో కొన్ని యథాతథ స్థితికి చేరుకుంటుండగా ఇంకా కొన్ని కోలుకోలేని స్థితిలో ఉన్నాయి. మున్నేరుకు రెండువైపులా ఆనుకుని ఉన్న కాలనీలపైనే సహాయ కార్యక్రమాలు చేస్తున్నారు.

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజకవర్గంలో వరద ముంపు మండలాలైన కూసుమంచి, ఖమ్మంరూరల్ మండలాల్లో పర్యటిస్తూ సహాయ కార్యకమాలు (మిగతా 6వ పేజీలో)

ప్రమాదంలో ప్రకాష్‌నగర్ బ్రిడ్జి

- మున్నేరు వరద తీవ్రతతో పక్కకు జరిగిన ఆరు స్లాబులు
- పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు
- మరమ్మతులకు రెండు నెలలు పడుతుందని అంచనా
- బ్రిడ్జిపై నుంచి భారీ వాహనాల రాకపోకలు నిలిపివేత



పక్కకు జరిగిన బ్రిడ్జి స్లాబ్

ఖమ్మం క్రైం, సెప్టెంబరు 5: ఇటీవల వచ్చిన వరదలకు ఖమ్మం ప్రకాష్‌నగర్ బ్రిడ్జి కొంచెం పక్కకు జరిగి ప్రమాదంలో ప్రమాదకరంగా మారింది. నాలుగురోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపైకి వరద చేరింది. దీంతో పోలీసులు రెండు రోజుల పాటు బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేశారు. అదే బ్రిడ్జిపై 9మంది చిక్కుకోగా ఎక్స్‌వేటర్ డ్రైవర్ వారిని చాకచక్యంగా ఒడ్డుకు చేర్చిన విషయం తెలిసిందే.. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కాగా వరదల తరువాత బిడ్జి మధ్యలో ఆరు స్లాబులు సుమార 10అంగులాలు పక్కకు జరిగాయి. దీంతో బ్రిడ్జి కూలుతుందనే సందేహలతో సోషల్‌మీడియాలో ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో వాహనదారులు ఆందోళనతో ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆర్అండ్‌బీ అధికారులు బ్రిడ్జిపైకి భారీ వాహనాలు రాకుండా నిలిపివేశారు. గురువారం ఆర్అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్ ఇంజనీరింగ్ ప్రత్యేక బృందంతో బ్రిడ్జి వద్దకు వెళ్లి పరిశీలించారు. కాగా పైన స్లాబ్‌లు మాత్రమే పక్కకు జరిగాయని, కింద పిల్లర్లు బాగానే ఉండటంతో భారీ క్రేన్ల సహాయంతో స్లాబులను రిపేరు చేయవచ్చని తెలిపారు. ఇందుకు సుమారు రెండు నెలలు సమయం పడుతుందని అధికారులు తెలిపారు. 11 సంవత్సారాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జిపై ఇలానే వాహనాల రాకపోకలు జరిగితే ప్రమాదం జరుగుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఢిల్లీలో రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న పె.ప్రభాకర్‌రెడ్డి

అవార్డులు అందుకున్న ఉత్తమ గురువులు

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 5: జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ గురువులుగా ఎంపికైన వారు గురువారం అవార్డులు స్వీకరించారు. జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన తిరుమలాయపాలెం మండల ప్రభుత్వ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి.. ఢిల్లీలో జరిగిన గురుపూజోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మానవ వనరుల అభివృద్ధి శాఖ సహయ మంత్రులు సంజయ్‌కుమార్, మంజుందార్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి బెస్ట్ టీచర్లుగా ఎంపికైన ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు కె.ఓంకార్, కొణిజర్ల మండలం పెద్దగోపతి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు గొట్టెముక్కల వెంకటేశ్వర్లు.. హైదరాబాద్‌లో జరిగిన గురుపూజోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు.



హైదరాబాద్‌లో మంత్రి పొన్నం నుంచి అవార్డు అందుకుంటున్న ఓంకార్



ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న జి.వెంకటేశ్వర్లు


ఉలిక్కిపడ్డ ఏజెన్సీ

భద్రాద్రి జిల్లా దోనాలగుంట అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టుల హతంతో కలకలం
- మృతుల్లో కీలకనేత లచ్చన్న దంపతులు
- ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులకు గాయాలు
- బిక్కుబిక్కుమంటున్న అటవీ గ్రామాలు
- పక్కా సమాచారంతోనే ఎన్‌కౌంటర్
- మణుగూరు ఆస్పత్రికి మృతదేహాల తరలింపు
- మృతుల్లో ఐదుగురు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర వాసులు



అడవిలో పహరా కాస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు



ఎస్పీ రోహిత్‌రాజ్

కరకగూడెం/చర్ల/మణుగూరు రూరల్,సెప్టెంబరు 5: భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలం మోతె సమీపంలోని దోనాలగుంట అడవిలో గురువారం ఉదయం 6గంటల సమయంలో జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనతో ఏజెన్సీ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టు నక్సల్స్ మృతిచెందడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చర్ల, వెంకటాపురం, ఏటూరునాగారం, దుమ్ముగూడెం, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకే పరిమితమవుతూ వస్తున్న ఎన్‌కౌంటర్ల పరంపర.. కరకగూడెం, తాడ్వాయి మండలాల సరిహద్దుల్లో చోటుచేసుకోవడంతో గిరిజన గ్రామాలు బిక్కుబిక్కుమంటున్నాయి. ఇటు పోలీసుల వరుస కూంబింగ్, అటు మావోయిస్టుల కార్యకలాపాలతో ఏ క్షణంలో ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి.

తాజా ఘటనలో రాష్ట్ర స్థాయి కీలక మావోయిస్టు నేత కుంజా వీరయ్య అలియాస్ లచ్చన్న, లచ్చన్న భార్య తులసి (అలియాస్ లక్కీ) రాము, శుక్రాం, దుర్గేష్, కోసిలు మృతిచెందారు. ఎదురుకాల్పుల్లో గ్రేహౌండ్ పోలీసులు వంశీ, సందీప్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని భద్రాచలంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిర్వహిస్తున్నారు. లచ్చన్న హతంతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలినట్లయింది. దీంతో మావోయిస్టులు ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశముండడంతో గిరిజన గ్రామాలు బిక్కుబిక్కుమంటున్నాయి.

పక్కా సమాచారంతోనే...

దోనాలగుంట ఎన్‌కౌంటర్ పక్కా సమాచారంతోనే జరిగి ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో గ్రేహౌండ్స్ పోలీసులు వంశీ, సందీప్‌లకు తీవ్ర గాయాలు కాగా, భద్రాచలంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిర్వహిస్తున్నారు. అయితే మావోయిస్టుల వైపే ఎక్కువ ప్రాణనష్టం జరగడంతో.. కాల్పులు ఏకపక్షంగా సాగాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఛత్తీస్‌గఢ్, మహరాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో వరుస ఎన్‌కౌంటర్‌ల నేపథ్యంలో వర్షాలు, వరదలకు ముందే మావోయిస్టులు తెలంగాణాలోని ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట, పినపాక, కరకగూడెం సరిహద్దు అటవీ ప్రాంతాలను సేఫ్‌జోన్‌గా ఎంచుకుని ఇక్కడ పాగా వేసినట్లుగా తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రత్యేక టెక్నాలజీ ద్వారా మావోయిస్టుల స్థావరాన్ని గుర్తించి ఎన్‌కౌంటర్ చేసినట్టు సమాచారం. ఈ ఘటనలో రాష్ట్ర గ్రేహౌండ్స్ సిబ్బంది పాల్గొనగా వారికి, స్పెషల్ పార్టీ పోలీసులు బ్యాకప్‌గా వ్యవహరించినట్టు తెలిసింది.

భారీ ఎన్‌కౌంటర్ ఇదే...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అడవుల్లో పెద్దగా మావోయిస్టుల కదలికలు లేవు. వరంగల్, ములుగు జిల్లాల్లో కూడా ఎన్‌కౌంటర్లు జరగలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో (మిగతా 6వ పేజీలో)

కిన్నెరసాని వాగు బాధితులు క్షేమం

- కలెక్టర్ చొరవతో బయటికి తీసుకొచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృందం
- ఇంకా లభించని గల్లంతైన వ్యక్తి ఆచూకీ

6

కూరగాయల ధరలకు రెక్కలు

- ఇటీవలే అదుపులోకి వచ్చిన ధరలు
- భారీ వర్షాలతో మళ్లీ పైపైకి
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 5: అసలే అధిక వర్షాలతో ప్రజలు విలవిలలాడుతుంటే దానికి తోడు కూరగాయల ధరలు కొండెక్కి చుక్కలు చూపిస్తున్నాయి. సామాన్యుడి వంటగదిలో కూరలు ఉడకకుండానే కుతకు తమంటున్నాయి. ఖమ్మం నగరంలోని రైతుబజా ర్లు, బహిరంగ మార్కెట్‌లలో కూరగాయలను ముట్టుకుం టే మంట పుడుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కురిసిన అధిక వర్షాలకు కూరగాయల పంట దెబ్బతినడంతో ధరలు ఊపందుకున్నాయి. ఇటీవల గత నెల రోజులుగా కూరగాయల ధరలు అదుపులోకి వచ్చి కొంత తక్కువ ధరలకు దొరుకుతున్నాయన్న సంతోషం కొద్ది రోజులు కూడా లేకుండా పోయింది. అదిక వర్షాలకు పంట దిగుబడి తగ్గి డిమాండ్‌కు దగ్గ సరఫరా లేక ధరలు కొండెక్కాయి. గత వారం క్రితం కిలో టమోటా రూ. 20ల నుంచి రూ.24 లు, కిలో పచ్చి మిర్చి రూ.20 లు, కిలో బీరకాయ రూ.30 ల వరకు వచ్చి కాస్త సామాన్యుడికి అందుబాటు ధరలోకి వచ్చింది. అలాంటి టమోటా ధరలు మళ్లీ పెరిగి ప్రస్తుతం కిలో రూ. 36 నుంచి రూ.40 లకు చేరింది. దీంతో వినియోగదారుడిపై అధిక ధరల భారం పడింది. మార్కెట్‌లలో టమోటానే కాకుండా ప్రతి కూరగాయ ధరలు ఆకాశాన్నం టాయి. సాధారణ రోజుల్లో కిలో రూ. 20 ల లోపు లభించే ప్రతీ కూరగాయలు ప్రస్తుతం కిలో రూ.50 ల నుంచి రూ.60 లకు చేరింది. గతంలో రూ. పదికి 3 ఆకుకూరల కట్టలు లభించేవి ఇప్పుడు రూ. 20 లకు 3 ఆకుకూరల కట్టలు మాత్రమే లభిస్తున్నాయి. నాలుగైదు రోజుల నుంచి నగరం లోని రైతుబజార్‌లు, బహిరంగ కూరగాయల మార్కెట్‌లలో కూరగాయల ధరలు పెరుగుతం డటంతో సామాన్యు డు కూరగా యలు కొనాలంటేనే బెంబేలెత్తు తు న్నాడు. రోజు రోజుకూ కూరగాయల ధరలు పెరుగుతూ పేద, మధ్యతరగతి వినియోగదా రులకు చుక్కలు చూపి స్తునాయి. ఇదిలా ఉండగా అధిక వర్షాలతో డిమాండ్‌కు సరిపడా లోకల్ కూరగాయల నిల్వలు లేక ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాలనుంచే కాకుండా రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవడంతో పాటు అక్కడా వర్షాల కారణంగా పంట దెబ్బతినడం, రవాణా చార్జీల భారం సైతం ఎక్కువగా ఉండటంతో కూరగా యల ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం రైతుబజార్, బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో ఒక్కంటికి)

కూరగాయలు	ధర రూ.లో
బీరకాయ	56-60
పచ్చిమిర్చి	30-40
కాకరకాయ	30-40
టమాటా	36-40
వంకాయ	30-40
బెండకాయ	30-40
పొట్లకాయ	45-50
దోసకాయ	30-40
గోరుచిక్కుడు	36-40
క్యాబేజీ	30-40
దొండ	30-40
సొరకాయ	26-30
క్యారెట్	50-60
క్యాప్సికం	50-60
ఆలుగడ్డ	40-45
ఉల్లిగడ్డ	70-80
కొత్తిమీర కట్ట	30-40
కోడిగుడ్లు (30)	150-160



నేడు 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో
మట్టి విగ్రహాల పంపిణీ

అశ్వారావుపేట, సెప్టెంబరు 5: అశ్వారావుపేట పట్టణంలోని గణేష్ టెంపుల్ వద్ద శుక్రవారం ఏబీఎన్-ఆంధ్రజ్యోతి, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణేష్ మట్టి విగ్రహాల పంపిణీ జరగనుంది. లేపాక్షి ఎంటర్ ప్రైజస్ సౌజన్యంతో ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని మట్టి గణేష్ విగ్రహాలను స్వీకరించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని 'ఆంధ్రజ్యోతి' నియోజవర్గ ఇన్‌చార్జి ఎస్.శ్రీనివాసరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సంక ప్రసాదరావులు కోరారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలి

సింగరేణి భవన్‌లో మట్టి గణపతి ప్రతిమల పంపిణీలో సీఎండీ బలరాం



గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న సీఎండీ

కొత్తగూడెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, దీని వల్ల ముందు తరాలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించిన వాళ్లం అవుతామని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం అన్నారు. గురువారం సింగరేణి భవన్‌లో ఉద్యోగులకు మట్టి గణపతి ప్రతిమల పంపిణీలో ఆయన మాట్లాడారు. సింగరేణి కాలరీస్ ప్రతీ ఏడాది పర్యావరణ హిత చర్యలో భాగంగా అన్ని ఏరియాల్లో యాజమాన్యం ఉచితంగా పర్యావరణ రహిత చర్యగా మట్టి వినాయక ప్రతిమలను కార్మికులకు పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజరు కో ఆర్డినేటర్ ఎస్‌డీఎం.సుభాని, చీఫ్ ఆఫ్ పవర్ విశ్వనాథరాజు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



భవాని ప్రకాష్ మృతదేహం

కల్లూరు, సెప్టెంబరు 5: కల్లూరులో ఓ యువకుడు తెలియనిబాధతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై గురువారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జూలూరుపాడు మండలం మాచినేనిపేట పెద్దతండాకు చెందిన బోడా భవాని ప్రకాష్ (23) గత కొంతకాలంగా కల్లూరులో లైఫ్‌లైన్ ఇంటర్నెట్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. స్థానికంగా గల సీహెచ్‌ఎన్ఆర్ మండపం పరిధిలో ఇంటర్నెట్ ఆఫీస్ నిర్వహణ కోసం తీసుకోన్న గదిలో బుధవారం రాత్రి గం..7-30గంటలకు ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇక్కడే పనిచేస్తున్న సహచర టెక్నీషియన్ లాల్‌మహ్మద్ రాత్రి గం..7-30 తరువాత ఆఫీస్‌కు రాగా భవానీ ప్రకాష్ శవమై కన్పించాడు. ఈ మేరకు లాల్‌మహ్మద్ జూలూరుపాడులో ఉన్న తల్లిదండ్రులకు సమాచారం అందించగా.. తండ్రి బోడా రాములు స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. తన కుమారుడు తెలియని బాధతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో పోలీసులు యువకుడిది ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు 5: రోడ్డు ప్రమాదంలో తీవ్రగా గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. రఘునాథపాలెం గ్రామానికి చెందిన యన్నమల సాయిచందర్, నీరుడు గోవర్ధన్ పెయింటర్లుగా పనిచేస్తున్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడకు ద్విచక్రవాహనంపై పనికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళుతుండగా సుబ్లేడు గ్రామ సమీపంలోని పెట్రోలు బంకు వద్దకు రాగానే గుంటలో పడిపోయారు. దీంతో సాయిచందర్ (27)కు బలమైన గాయాలు కాగా ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సాయిచందర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాదు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో సూర్యాపేట ఆసుపత్రిల చేర్పించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. ఈమేరకు బంధువులు స్థానిక పోలీసుస్టేషన్‌లో పిర్యాదుచేయగా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

మృతదేహంతో రహదారిపై ధర్నా

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్



ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్థులు

చింతకాని/ఖమ్మం క్రైం, సెప్టెంబరు 5: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మండల పరిధిలోని రామకృష్ణాపురం క్రాస్‌రోడ్ సమీపంలోని బోనకల్-ఖమ్మం ప్రధాన రహదారిపై గ్రామస్థులు మృతదేహంతో గురువారం ధర్నా నిర్వహించారు. గ్రామానికి చెందిన గుర్రం నాగేశ్వరరావు, భార్య వసంత ఇరువురు మంగళవారం ఖమ్మంలో కూలీపనులకు వెళ్లి సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నారు. ఇటీవల భారీ వర్షాలకు వచ్చిన వరదలతో ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ధంసలాపురం వాగు వద్ద ప్రధాన రహదారిపై బురద పేరుకుపోవడంతో బురదకు వారి వాహనం అదుపుతప్పి కిందపడింది. దీంతో నాగేశ్వరరావు భార్య వసంత తలకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. వరదలకారణంగా మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షల పరిహారాన్ని వసంత కుటుంబానికి అందజేసి ఆదుకోవాలని వసంత మృతదేహంతో ప్రధాన రహదారిపై గ్రామస్థులు ధర్నా చేశారు. ధర్నాతో రహదారికి ఇరువైపుల భారీగా వాహనాలు నిలిచిపోవడంతో సమాచారం తెలుసుకున్న ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్, చింతకాని ఎస్ఐ నాగుల్‌మీరా అక్కడికి చేరుకుని ధర్నా చేస్తున్న వారితో మాట్లాడి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా ప్రయత్నిస్తామని చెప్పటంతో ధర్నా విరమించారు.

ఆటోలో గర్భిణి ప్రసవం

భద్రాద్రి వైద్యశాల ప్రాంగణంలో ఘటన

భద్రాచలం, సెప్టెంబరు 5: భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో బుధవారం అర్ధరాత్రి ఆటోలోనే ఓ గర్భిణి ఆడశిశువును ప్రసవించింది. భద్రాచలంలోని శిల్పినగర్ ప్రాంతానికి చెందిన గ్రంధి శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. తన భార్య సంధ్యారాణికి పురిటి నొప్పులు వస్తుండటంతో బుధవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో ఏరియా వైద్యశాలకు వెళ్లారు. ఈ సమయంలో గైనకాలజిస్టు అందుబాటులో లేరని అక్కడ వైద్యాధికారులు, సిబ్బంది పేర్కొని కొత్తగూడేనికి రిఫర్ చేశారు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి తిరిగి మళ్లీ భద్రాద్రి ప్రభుత్వ వైద్యశాలకు రాగా కొత్తగూడెం రిఫర్ చేశాం కదా మళ్లీ ఎందుకు వచ్చారు అని సిబ్బంది పేర్కొంటున్న సమయంలోనే ఆటోలో ఆమె ప్రసవించి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. దీంతో సిబ్బంది తల్లిబిడ్డను వైద్యశాలలోకి తీసుకెళ్లి చికిత్స అందించారు. కాగా తల్లీబిడ్డ ఇరువురు క్షేమంగా ఉన్నారు. ఈ విషయంపై ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా గైనకాలజిస్టు లేకపోవడంతో కొత్తగూడెం రిఫర్ చేసిన మాట వాస్తవమేనని ఎందుచేతనో వారు మళ్లీ ఏరియా వైద్యశాలకు రావడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఆటోలో గర్భిణీ ప్రసవించిందన్నారు. తమ సిబ్బంది తల్లి, బిడ్డకు వైద్య సేవలందించారని పేర్కొన్నారు.

కొట్టుకుపోయిన సీతారామాకెనాల్ రివిట్‌మెంట్



కెనాల్ రివిట్‌మెంట్ కొట్టుకుపోయిన దృశ్యం

అశ్వాపురం సెప్టెంబరు 5: మండల పరిధిలోని మొండికుంట, బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ అటవీ ప్రాంతంలో పాలవాగు వద్ద సీతారామా ప్రాజెక్ట్‌కు సంబంధించిన కెనాల్ రివిట్‌మెంట్ గురువారం కొట్టుకుపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకుతోడు గురువారం తెల్లవారుజామున కురిసిన భారీవర్షానికి పాలవాగు ఉధృతంగా ప్రవహించి సీతారామా కెనాల్‌లోకి వరద రావడంతో రివిట్‌మెంట్ కొట్టుకుపోయింది. కెనాల్ కట్టకోతకు గురైంది. దీంతో కెనాల్‌కు గండిపడే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రాజెక్ట్ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉంది.

భర్త కోసం భార్య పోరాటం



భర్త ఇంటిముందు బైఠాయించిన దివ్య

ముదిగొండ, సెప్టెంబరు 5: తనకు న్యాయం కావాలంటూ భర్త ఇంటిముందు భార్య బైఠాయించి ధర్నాకు దిగింది. ఈ సంఘటన ముదిగొండ మండలం ఖానాపురంలో గురువారం చోటుచేసుకుంది. ముదిగొండ మండలం సువర్ణాపురం గ్రామానికి చెందిన ఉండేటి సాల్మాన్‌రాజ్(లేటు), జాస్మిన్ దంపతుల కుమార్తె దివ్యతో అదే మండలం ఖానాపురం గ్రామానికి చెందిన వల్లాల శ్రీను అలియాస్ ప్రకాష్‌తో ఈ ఏడాది ఫిబ్రవరి 12న వివాహం జరిగింది. పెళ్లైన కొద్దిరోజులకే భర్త శ్రీను చిత్రహింసలు పెట్టి నిందలు వేసి ఇంటి నుంచి వెళ్లగొట్టారని ఆరోపించారు. భర్త, అత్తమామలు ఇంటికి తాళాలు వేసుకొని వెళ్లడంతో ఇంటిముందు తల్లి జాస్మిన్, కుటుంబసభ్యులతో కలిసి బైఠాయించింది. తన భర్త తనకు కావాలని ఆందోళన చేసింది.

కిన్నెరసాని వాగు బాధితులు క్షేమం

- కలెక్టర్ చొరవతో బయటికి తీసుకొచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృందం
- ఇంకా లభించని గల్లంతైన వ్యక్తి ఆచూకీ



పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 5: భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం దంతెలబోర వద్ద కిన్నెరసాని వాగులో చిక్కుకున్న ఏడుగురిలో ఆరుగురిని క్షేమంగా బయటికి తీసుకొచ్చారు. ఒక వ్యక్తి మాత్రం వాగులో గల్లంతయ్యారు. వారిని వాగునుంచి బయటికి తీసుకొచ్చేందుకు భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కృషి చేశారు. వాగు మధ్యలో చిక్కుకున్న బాధితులకు కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రోన్ సహాయంతో ఆహార పదార్థాలు, తాగునీటిని అందచేశారు. వాగులో మధ్యలో చిక్కుకున్న ఏడుగురిలో జారె సాయి అనే వ్యక్తి బుధవారం రాత్రి వాగు తగ్గిందని భావించి దాన్ని దాటే ప్రయత్నం చేయగా అందులో గల్లంతయ్యాడు. అతడిని వెతికేందుకు గురువారం ఉదయం ఐదుగురు వెళ్లగా అదే సమయంలో కిన్నెరసాని గేట్లు ఎత్తగా వారు సైతం వాగు మధ్యలో చిక్కుకున్నారు. కలెక్టర్ సూచనతో వారందరికీ ముందు డ్రోన్ సహాయంతో ఆహారం, తాగునీరు అందచేశారు. తరువాత అందరినీ బయటికి తీసుకొచ్చేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. ఈ క్రమంలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కిన్నెరసాని, కేటీపీఎస్ అధికారులతో మాట్లాడి కిన్నెరసాని ప్రవాహం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో అంచనా వేసి ప్రాజెక్టు గేట్లు దించాలని సూచించారు. అధికారులు వెంటనే స్పందించి కిన్నెరసాని గేట్లు దించడంతో నీటి ఉధృతి తగ్గింది. దీంతో వారందరినీ రాత్రి 7గంటల సమయంలో క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. ఘటనా స్థలం వద్ద కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, పాల్వంచ తహసిల్దార్, సీఐలు వాగులో చిక్కుకున్న వారు బయటకు వచ్చేంత వరకు నిరంతరం పర్యవేక్షణ చేశారు.

జోరుగా సహాయక చర్యలు

(5వ పేజీ తరువాయి)

పర్యవేక్షిస్తున్నారు. అధికారులకు దశదిశ నిర్దేశిస్తూ నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ సహాయ కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు వరద సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ పర్యవేక్షణ సాగిస్తున్నారు.

బాధితుల ఆవేదనలు

వరద తగ్గుముఖం పట్టినా పూర్తిగా బురదమయమైన ఇళ్లలోకి వెళ్లలేని పరిస్థితుల్లో బాధితులు ఉన్నారు. నగరంలోని బొక్కలగడ్డ, మోతీనగర్, వెంకటేశ్వరనగర్, కాల్వొడ్డు, పద్మావతినగర్, ధంసలాపురం, పెద్దతండా, కరుణగిరి, రాజీవ్‌గృహకల్ప, ప్రకాష్‌నగర్ లోతట్టుకాలనీల వాసులు ఇటు బురదకు, అటు వర్షానికి అసౌకర్యంతో ఇబ్బందులు పడుతున్నారు. దాతల సాయంకోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం అందించే నిత్యావసర కిట్లు కాలనీల్లో, బజార్లలో ఇంటింటికి ఇస్తున్నా శివారు ఇళ్లకు మాత్రం చేరడంలేదు. దీంతో నిత్యావసరాల కోసం బాధితులు పరుగులు తీస్తున్నారు. ఆధార్‌కార్డులు పట్టుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సర్వేలో పేర్లు ఎక్కనివారు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఇంటి యజమానులు అద్దెకున్నవారి పేర్లు కాకుండా తమ పేర్లు పెట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఇంటి యజమానులకు, అద్దెవారికి విభేదాలు తలెత్తుతున్నాయి. మరోవైపు బాధితులకు సాయం అందించేందుకు దాతలు పెద్దఎత్తున ముందుకు వస్తున్నారు.

ప్రకృతి విపత్తులు బాధాకరం

రగ్గులు పంపిణీ చేసిన చినజీయర్ స్వామి

ఖమ్మం సాంస్కృతికం, సెప్టెంబరు 5 : ప్రకృతి విపత్తులు అత్యంత బాధాకరమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. ఖమ్మంలో మున్నేరు వరద కలిగించిన నష్టం వివరాలు తెలుసుకొని బాధితులను పరామర్శించేందుకు గురువారం ఆయన ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మున్నేటి వరద ధాటికి గురైన కాల్వొడ్డు ప్రాంతంలో బాధితులను కలిసి ఓదార్చారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామి మాట్లాడుతూ విపత్తుల ధాటికి గురైన వారు మనోధైర్యం కోల్పోకుండా వ్యవహరించాలన్నారు. సేవలందించేందుకు ఎవరికి సాధ్యమైనంతవరకు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో వరద బాధితులకు రగ్గులను పంపిణీ చేశారు. బిస్కెట్లు, నీళ్ల ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి నాయకులు పోలా శ్రీనివాస్, వెంపటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నీరే మిగిలింది..

- పాలేరు డివిజన్‌వ్యాప్తంగా 8వేల హెక్టార్లలో పంటనష్టం



కూసుమంచి మండలం గోరీలపాడుతండలో మునిగిన పంటను చూపిస్తున్న తేజావత్ వెంకన్న

కూసుమంచి, సెప్టెంబరు 5: పాలేరు వరదనీరు రైతులను ఇంకా వదలడం లేదు. జలాశయం చుట్టూ పరీవాహక ప్రాంతంలో చెరువులు, కుంటలు తెగడంతో వరదనీరు ఇంకా కొనసాగుతోంది. దీంతో జలాశయం ఇంకా అలుగులు పారుతోంది. వరద నీటికారణంగా పాలేరు డివిజన్ వ్యాప్తంగా సుమారు 8వేల హెక్టార్లలో పంటనష్టం సంభవించినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనావేశారు. సుమారు 2లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో రెండు రోజుల్లో 20టీఎంసీల ప్రవాహం జరిగింది. దీంతో వరిపొలాలు, మిర్చితోటలు, పత్తిపంట వరదకు కొట్టుకుపోయింది. వర్షాలు తగ్గి మూడురోజులు అవుతున్నా.. వరదమాత్రం తగ్గడం లేదు. ఇంకా పొలాల్లో నీరు నిలిచిపోయింది. వందలాది ఎకరాల్లో ఇసుకమేటలు వేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారి వాణి ఆధ్వర్యంలో పంటనష్టంపై ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నారు. అధికంగా పాలేరు, నర్సింహులగూడెం, కొత్తూరు, చౌటపల్లి, నాయకన్‌గూడెం, మల్లాయిగూడెం, జక్కేపల్లి, పెరికశింగారం, గోరీలపాడుతండ, తుమ్మలతండ, హీరామాన్‌తండాల్లో పంటనష్టం ఎక్కువగా ఉంది.

ఉలిక్కిపడ్డ ఏజెన్సీ

(5వ పేజీ తరువాయి)

మాత్రమే అడపాదడపా ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఒకరిద్దరు నక్సల్స్ చనిపోయారు. ఆ తరువాత 2020లో చర్ల మండలం చెన్నాపురం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చర్ల కమాండర్ జోగయ్యతోపాటు ఇద్దరు మహిళలు మృతిచెందారు. ఆ ఘటన తరువాత జిల్లాలో ఎక్కడా ఎన్‌కౌంటర్లు జరగలేదు. తాజాగా జరిగిన ఎన్‌కౌంటరే పెద్ద ఎన్‌కౌంటర్. కాగా భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, ఏఎస్పీ పంకజ్ పరితోష్ గురువారం దోనాలగుంట అడవి ప్రాంతాన్ని పరిశీలించారు. ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారని తెలిపారు. మృతదేహాలను మణుగూరు తరలిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం, ఏడూళ్లబయ్యారం ఎస్ఐలు రాజేందర్, రాజ్‌కుమార్, పోలీస్‌బలగాలు పాల్గొన్నారు.

9న రాష్ట్ర బంద్: మావోయిస్టు నేత ఆజాద్

కరకగూడెం మండల సరిహద్దుల్లోని రఘునాథపాలెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్... విప్లవ ద్రోహుల కుట్రతోనే జరిగిందని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ ఒక ప్రకటనలోపేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు ప్రధాన బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. తమ పార్టీ సభ్యులతో పాటు ఓ గ్రామస్థుడిని పోలీసులు హతమార్చారని ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌కు నిరసనగా 9వ తేదీన రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఆజాద్ పేర్కొన్నారు.

అధైర్య పడొద్దు.. అందరినీ ఆదుకుంటాం

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఖమ్మం రూరల్‌లో వరద బాధితులకు పరామర్శ



వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 5: వరద బాధితులు అధైర్య పడవద్దని, ప్రభుత్వం అందరినీ ఆదుకుంటుందని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండల పరిధిలోని రాజీవ్‌గృహకల్ప, కరుణగిరి, జలగంనగర్, పెద్దతండా తదితర ముంపు గ్రామాల్లో గురువారం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడుతూ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సహాయంతో పాటు పొంగులేటి స్వరాజ్యం-రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరుపున తమ వంతు సాయం కూడా అందించనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వరద ముంపు బాధితులకు శుక్రవారం సాయంత్రం వరకు రూ.10వేల ఆర్థిక సాయం వారి అకౌంట్లలో జమ చేస్తామన్నారు. ప్రతి ఇంటికి వరద సాయం అందజేస్తామని, బాధితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, నాయకులు బండి జగదీష్, మద్ది వీరారెడ్డి, రవి, బుజంగరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం..

- ఇళ్లు కోల్పోయిన వారు ఆందోళన చెందవద్దు
- మెరక ప్రాంతానికి వచ్చే వారికి ప్రాధాన్యం
- బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- నగరంలో మున్నేరు బాధితులకు పరామర్శ
- ఇంటింటికి నిత్యావసరాల పంపిణీ

ఖమ్మం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మున్నేరు వరదలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, మున్నేరు వద్ద లోతట్టులో ఉండి ఇల్లు కోల్పోయినవారు స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారికి ప్రాధాన్యతనిచ్చి వెంటనే ఇల్లు మంజూరుచేసి మెరక ప్రాంతంలో నిర్మిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఏ ఒక్కరు అధైర్యపడవద్దని, నిత్యావసర వస్తువులు ఇంటివద్దకే చేరతాయని భరోసా ఇచ్చారు.

ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డలో మున్నేరు వరద ప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్లను గురువారం ఉదయం మంత్రి తుమ్మల సందర్శించారు. బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బొక్కలగడ్డలో ప్రతి గల్లీ తిరిగి వరదనష్టాన్ని పరిశీలించారు. మంత్రి తుమ్మల రాగానే మహిళలు తమ గోడు వినిపించారు. సర్వం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశా రు. దాంతో బాధిత మహిళలను మంత్రి తుమ్మల ఓదార్చా రు. ఎవరు ఆవేదన చెందవద్దని, మున్నేరు పక్కన ఉండడంతోనే ఇంతనష్టం జరిగిందని, ఇప్పటికైనా స్వచ్ఛందంగా మై దాన ప్రాంతానికి రావడానికి సిద్ధం కావాలని సూచించారు.

ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఇంటింటికి సర్వే నిర్వహిస్తున్నామని, నిత్యావసరాలు కూడా ఇంటింటికి అందిస్తున్నామని తెలిపారు. ఎవరు కంగారుపడి బయట తిరగొద్దని విజ్ఞప్తి చేశారు. పునరావాసకేంద్రాల్లో వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. పూర్తిగా ఇళ్లు శుభ్రం అయిన తర్వాతనే ఇళ్లలోకి రావాలని సూచించారు. అనంతరం మంత్రి తుమ్మల బొక్కలగడ్డకాలనీలో ఇంటింటికి నిత్యావసరాలు పంపిణీని ప్రారంభించారు. సర్వేప్రకారం ఇళ్లకు నిత్యావసరాలు, దుస్తులు, పాలప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.



మధిర మండలం చిలుకూరులో రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రైతులకు అండగా ఉంటాం

మధిర, ఎర్రుపాలెం మండలంలో పంటల పరిశీలన

మధిరరూరల్/ఎర్రుపాలెం: భారీవర్షాలు, వరదలతో పంటలు కోల్పోయిన రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా మధిర, ఎర్రుపాలెం మండలంలో పర్యటించిన ఆయన చిలుకూరు గ్రామంలో వరదలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.



మంచికంటి నగర్‌లో పర్యటిస్తున్న మంత్రి తుమ్మల

ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను మంత్రి తుమ్మలకు వివరించారు. చిలుకూరు గ్రామానికి రెండు వైపులా ఉన్న వైరా, కట్టలేరు వరద ఉధృతికి రైతుల పత్తి, వరిపొలాలు పూర్తిగా మునిగిపోయాయని, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ రైతుల సమస్యలు తెలుసుకొనేందుకే తాను వచ్చానని, ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. దెబ్బతిన్న పంటలను పూర్తిస్థాయిలో సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎర్రుపాలెం మండలం మీనవోలులో పర్యటించిన మంత్రి నీటమునిగిన పత్తి, వరి పంటలను పరిశీలించారు. బాధిత రైతులను ఓదార్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, జరిగిన పంట నష్టాన్ని అంచనావేసి బాధిత రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పంట నష్టం వివరాలను త్వరగా నమోదు చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రైతు నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య, మధిర సంచాలకులు ఎస్.విజయచంద్ర, ఏవో డీఎస్‌కే.శ్రీనివాసరావు, మధిర తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, నాయకులు మొండితోక సుధాకర్, మల్లాది వాసు, సూరంశెట్టి కిషోర్, నిడమానూరి వంశీ, దారా బాలరాజు, కర్నాటి రామారావు, పులిబండ్ల చిట్టిబాబు, కోనా ధనికుమార్, రైతులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

- ● మున్నేరు వరద బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది
- ● రాష్ట్రనాయకుల తాండ్ర వినోదరావు



మాట్లాడుతున్న వినోదరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, సెప్టెంబరు 5: ఖమ్మం వరద బాదిత ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని, వారికి అండగా బీజేపీ కూడా ఉంటుందని బీజేపీ రాష్ట్ర నాయకుల తాండ్ర వినోదరావు పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేళ్లలో ఎన్నడూ లేనంతగా వరదలు వచ్చాయని, దీంతో ప్రజలు నిరాశ్రయలుయ్యారన్నారు. రాజీవ్‌గృహకల్ప, మోతీనగర్ బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వం, అధికారులు సరిగా పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేయలేదన్నారు. పట్టణప్రాంతాల్లో ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతాలు, తండాలను పట్టించుకోవడం మానేశారని ఆరోపించారు. అదేవిధంగా కరుణగిరి ప్రాంతలో వరదలు రాకుండా పెద్దగుట్టగా అడ్డుగా ఉండేదని, ఇప్పుడు దానిని తొలగిండచంతో కనీసం అక్కడ గోడలు కూడా నిర్మించకపోవడంతో ముంపునక గురయ్యారన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ కొంతమంది రాష్ట్రానికి బీజేపీ ఏమీచేయలేదని విమర్శలు చేస్తున్నారని, రాష్ట్రానికి ముందుగానే కేంద్రం రూ.1300కోట్లు మంజూరుచేసిందని, వాటిని వాడుకోవాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినట్టు తెలిపారు. ముంపు ప్రాంతాల ప్రజలకు సహాయసహకారాలుఅందించడంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముందుంటున్నారని రోజు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ వారికి అవసరమైన సహాయం చేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, శ్యామ్‌రాథోడ్, రవి, కోటేశ్వరావు, చావా కిరణ్, రవిరాథోడ్, కార్తీక్, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

శిక్షణలోనూ సేవే..

- ▸ వరద బాధితుల సేవలో 525 మంది ట్రైయినీ పోలీసులు
- ▸ ఉమ్మడి జిల్లా నుంచి సహాయక చర్యలకు వందమంది ఫైర్‌సిబ్బంది ▸ రెండు రోజులుగా రోడ్లపై విధులు



సహాయక చర్యల్లో పాల్గొన్న శిక్షణ పోలీసు సిబ్బంది

ఖమ్మం క్రైం, సెప్టెంబరు 5: వారంతా శిక్షణలో ఉన్నారు. ఇతర జిల్లాల నుంచి ఖమ్మంలోని సీటీ ట్రైనింగ్ సెంటర్‌లో పోలీస్ కానిస్టేబుళ్లుగా శిక్షణ పొందుతున్నారు. అయినా ఒక వైపు వారు శిక్షణ తీసుకుంటూ మరోవైపు సేవలో నిమగ్నమయ్యారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వరదబాధితులకు అండగా ఉంటూ వారి పనులలో సహాయం చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు నగరంలో పలు ప్రాంతాలు వరదకు గురైయ్యాయి. పలుశాఖల సిబ్బంది విధులు నిర్వహిస్తూ పనులు చేస్తున్నప్పటికి ప్రజలు ఇబ్బందులు గురైవుతున్నారు. దీంతో సీపీ సునీల్‌దత్ ప్రజలకు అండగా వారికి సహాయం చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ట్రెయినీ పోలీసు కానిస్టేబుళ్ల ప్రజలకు సహాయం చేస్తున్నారు. ముంపు ప్రాంతాలలో ఒక్కొ ప్రాంతానికి 20నుంచి 40మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు రోజు విధులలో ఉంటున్న సిబ్బంది కూడా ప్రజలకు అండగా ఉంటున్నారు.

సహాయక చర్యలలో 525మంది

సహాయక చర్యలలో 525మంది ట్రెయినీ కానిస్టేబుళ్ల పాల్గొంటున్నారు. వీరిలో సీటీ ట్రైనింగ్ సెంటర్ నుంచి 265మంది, సత్తుపల్లి బెటాలియన్ నుంచి 260మంది ఈ సహాయక చర్యలలో పాల్గొంటున్నారు. ఇళ్లలో సామన్లు బయటకు తెచ్చేందుకు, చెత్తను , బురదను తొలగించేందుకు వారు సహాయం చేస్తున్నారు. ఇళ్లలోని సామాన్లు సైతం బయటకుతీసుకు వచ్చి శుభ్రపరుస్తున్నారు. వీరంతా ప్రజలు సామాన్య పరిస్థితులకు వచ్చేవరకు ఇలా సహాయపడనున్నారు. వీరంతా ఉదయం 10గంటల వరకు ట్రైనింగ్ తీసుకుంటూ ఆ తరువాత నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రజలకు సహాయం చేస్తూ విధులు నిర్వహిస్తున్నారు.

సహాయక చర్యలలో ఫైర్ సిబ్బంది

వరద ప్రభావిత ప్రాంతాలలో రెండు రోజుల నుంచి ఫైర్ సిబ్బంది రోడ్లపై విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా ఫైర్ అధికారి బి.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రాత్రి పగలు తేడా లేకుండా ఫైర్ ఇంజన్లతో రోడ్లు శుభ్రం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 100ఫైర్ సిబ్బంది నగరంలోని వరద ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సిబ్బంది సరిపోకపోవడంతో పక్క జిల్లా నుంచి సిబ్బంది ఖమ్మం చెరుకుని రోడ్లను శుభ్రం చేస్తున్నారు. రోడ్లని శుభ్రం చేసేందుకు ఖమ్మం జిల్లా నుంచి 6ఫైర్ ఇంజన్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 5ఫైర్ ఇంజన్లు తెప్పించారు. మరో తుఫాన్ రానున్న నేపథ్యంలో ముందుస్తు చర్యలలో భాగంగా హనుమకొండ, సూర్యపేట, నల్లగొండ, కోదాడ నుంచి బోటులు తెప్పిచనున్నారు. మెదటరోజు సహాయక చర్యలలో భాగంగా నిజమాబాద్, వికరాబాద్, సిబ్బంది బోట్లను తీసుకుని ఖమ్మం కు వచ్చి విధులు ముగించుకుని తిరిగి వెళ్లిపోయారు.



రోడ్లను శుభ్రం చేస్తున్న ఫైర్ సిబ్బంది

కేఎంసీలో కోలాహలం

- ● వరద బాధితులకు దుస్తులు, నిత్యావసరాల పంపిణీ సందడి
- ● డీఆర్‌డీఏ, మహిళా సంఘాల సహకారం



ప్యాకింగ్ చేస్తున్న డీఆర్‌డీఏ ఉద్యోగులు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 5: ఎప్పుడు పారిశుధ్య కార్మికులు, ఫిర్యాదుదారులు, కార్పొరేటర్లు, నాయకులతో సందడిగా ఉంటే ఖమ్మం నగర పాలక సంస్థ గత రెండు రోజులుగా వరద బాధితులకు చేయూత అందించే కేంద్రంగా మారింది. నిత్యవసరాలు ప్యాకింగ్ నుంచి రవాణా వరకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ బాధ్యతలు అప్పగించారు. దీంతో కేఎంసీలో రెండు రోజులుగా డీఆర్‌డీవో సన్యాసయ్య పర్యవేక్షణలో 82 మంది డీఆర్‌డీఏ ఉద్యోగులు డీపీఎంలు 5, ఏపీఎంలు 20, ఈసీలు 20, టీలు 90, సీసీలు 60, సీవోలు 55, టీఏలు 90, క్షేత్రస్థాయి సహాయకులతో పాటుగా చింతకాని, రఘునాథపాలెం, కొణిజర్ల, వైరా, ముదిగొండ, నేలకొండపల్లి నుంచి80 మంది గ్రామదీపికలు ప్యాకింగ్, పంపిణీ కార్యక్రమాలు చేస్తున్నారు. కేఎంసీలో ఎటు చూసినా గుట్టలు గుట్టలుగా ప్యాకింగ్ చేస్తున్న మహిళలే కనిపిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్

- ● పాఠశాలలకు నెలకు రూ.18లక్షల భారం తగ్గనుంది
- ● జిల్లాలో 209 ఉన్నత, 1155 ప్రాథమిక పాఠశాలలకు లబ్ధి

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 5: ఖమ్మం జిల్లాలోని 209 ఉన్నత పాఠశాలలకు, 1155 ప్రైమరీ పాఠశాలలకు ఈ నెల నుంచి ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందించనున్నది. దీనికి సంభందించి గురువారం ప్రభుత్వ కార్యదర్శి రోనాల్డ్‌రోస్ జోవో విడుదల చేశారు. జిల్లాలోని 209 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు నెలకు ఒక్కో పాఠశాలకు రూ.3వేలు, ప్రైమరీ పాఠశాలకు ఒక్కో పాఠశాలకు రూ. 1000లు కరెంటు బిల్లును ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కడుతున్నారు. కాగా ప్రభుత్వం విడుదల చేసిన జీవోతో సెప్టెంబర్ నెల నుంచి ఉచిత విద్యుత్‌ను అందించనున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా రూ. 18 లక్షల వరకు ఆదా కానున్నది.

విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి

▸ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంటౌన్,సెప్టెంబరు 5: మున్నేరు వరదలతో ఉపశమనం కలుగుతున్న ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్దరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్నేరు ముంపుకు గురైన బొక్కలగడ్డ, మంచికంటినగర్ ప్రాంతాల్లో జరుగుతున్న విద్యుత్ మరమ్మతుల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు తలెత్త కుండా యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్దరణ పనులు పూర్తి చేయాలన్నారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సహాయ చర్యలను పరిశీలించిన ఎస్బీఎం డైరెక్టర్

ముంపు బాధితులకు అందుతున్న సహాయ చర్యలను ఎస్బీఎం డైరెక్టర్ సురేష్‌బాబు గురువారం పరిశీలించారు. ఖమ్మంరూరల్ మండలం రాజీవ్ గృహకల్ప కాలనీ, వాల్యాతండా, కాచిరాజుగూడెం, కస్నాతండా, తనగంపాడు,నాయుడుపేట, జలగంనగర్, పెద్దతండా, కేబీఆర్ నగర్‌లలో ఆయన పర్యటించి, బాధితుల ఇంటింటికీ తిరిగి నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందరికీ అందుతుంతో లేదో అడిగి తెలుసుకున్నారు. బియ్యం, నిత్యావసరాలు, ఇతరత్రా సహాయం వివరాలను పరిశీలించారు.

పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలి

పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్.పి.శ్రీజ పేర్కొన్నారు. గురువారం అదనపు కలెక్టర్ తిరుమలాయపాలెం మండలం రాకాసితండా, కూసుమంచి మండలం పాలేరు, ఖమ్మం రూరల్ మండలం రాజీవ్ గృహకల్ప, పోలేపల్లి ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వ్యాధులు రాకుండా బ్లీచింగ్ చల్లించాలని, దోమల నియంత్రణకు ఆయిల్‌బాల్స్‌ను నిల్వఉన్న నీళ్లలో వదలాలని, వైద్యశిబిరాల్లో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని కోరారు.

బాధితులకు అండగా కమ్మ సేవా సంఘాల సమాఖ్య



నిత్యావసరాలు అందిస్తున్న రాష్ట్ర కమ్మ సేవాసంఘాల సమఖ్య నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 5: ఖమ్మం నగరంలో వచ్చిన భారీ వరదలకు సమస్తం కోల్పోయిన వరద బాధితులకు గురువారం రాష్ట్ర కమ్మ సేవా సంఘాల సమఖ్య ఆధ్వర్యంలో ఆపన్నులకు తన వంతు చేయుతనిచ్చి ఆదుకుంది. వరద బాధితులకు ఆహార పదార్థాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. హైదరాబాద్, వరంగల్ సంఘాల సమఖ్యల ఆధ్వర్యంలో వరద ముంపునకు గురైన ఖమ్మంలోని పద్మావతి నగర్ కాలనీలో 1000 మంది బాధితులకు వారం రోజులు సరిపడ 16 రకాల నిత్యవసర వస్తువులతోపాటు దుప్పట్లు అందించారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎప్పుడు ఆపదలో ఉన్నా సత్వరమే స్పందించి అవసరమైన సహాయాన్ని అందించటంలో కమ్మ సంఘం ముందుంటుందన్నా రు. అందులో భాగంగానే గురువారం వరద బాధితులకు సహాయం అందించా మన్నారు. వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటనే స్పందించటంతోనే ప్రాణనష్టం జరగలేదన్నా రు. వరద ముంపు ప్రాంతాల్లో మంత్రులు తిరిగి బాధితులకు భరోసా కల్పించి, సహాయక చర్యలు దగ్గర ఉండి పర్యవేక్షించటంతోనే బాధితులు తిరిగి ఇళ్లకు చేరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సమఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు రవిశంకర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రసాద్, ట్రెజరర్ రత్నాకర్, నగర మేయర్ నీరజ, బిక్కసాని నాగేశ్వరరావు, సైదబాబా, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

తాలిపేరుకు భారీ వరద

● 25గేట్లు ఎత్తివేత ● 99వేల క్యూసెక్కుల నీరు విడుదల



ప్రాజెక్టు నుంచి నీటి విడుదల దృశ్యం

చర్ల, సెప్టెంబరు 5: చత్తీస్‌గడ్ తో పాటు, చర్ల మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. వరద తాకిడి పెరగడంతో గురువారం ప్రాజెక్టు 25 గేట్లను ఎత్తి, 99వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గత రెండు రోజులుగా చర్ల మండలంతోపాటు సరిహద్దునున్న చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. పామేడులోని చింతవాగు, చర్ల మండలంలోని రోటింత వాగు, జెర్రిపోతుల, తరివాగు, ఈతవాగులు వాగులు పొంగి పొర్లు తున్నాయి. దీంతో తాలిపేరు ప్రాజెక్టులోకి గంట గంటకూ వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట వద్ద పరిస్థితిని అంచానా వేస్తున్న డీఈ తిరుపతి, ఏఈ శ్రీనివాసరావు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రాజెక్టు వద్ద ప్రస్తుత నీటి మట్టం 72.01 మీటర్లు కాగా, ఇన్‌ఫో లక్ష క్యూసెక్కులుగా ఉంది..

ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్



బాధిత ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 5: మండల పరిధిలోని రాజీవ్‌గృహకల్ప, నాల్గవతరగతి ఉద్యోగుల కాలనీ తదితర ముంపు కాలనీలను గురువారం కలెక్టర్ ముజమిల్ ఖాన్ పరిశీలించారు. ముంపునకు గురైన వీదులను ఇళ్లను పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా బాధితులతో మాట్లాడి వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అధికారులు సిబ్బందిని గ్రూపులవారీగా ఏర్పాటు చేసి అన్ని వీధులలో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వీధుల వెంట బురదను తొలగించి బ్లీచింగ్ చల్లించాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. బాధితులు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని వీలైనంత త్వరగా సహాయక చర్యలు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. బాదితులకు ఎవరికి ఏ అవసరం వచ్చానా సరే వెంటనే వాటిని పరిష్కరించేలా అధికారులు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఎంపీవో రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య ‘కుతుంబాక’ అంత్యక్రియలు

- ● నివాళులు అర్పించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ● ఎంపీ రఘురాంరెడ్డి, టీడీపీ నాయకులు

రఘునాథపాలెం, సెప్టెంబరు 5: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కుతుంబాక బసవన నారాయణ అంత్యక్రియలు ఆయన స్వగ్రామం వీ వెంకటాపాలెంలో అశ్రునయనాల మధ్య గురువా రం ముగిశాయి. కుటుంబ సభ్యులు, టీడీపీ శ్రేణులు, కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ నాయకులు భారీగా అంత్యక్రియల కార్యక్రమానికి హాజరైనారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుతుంబాక భౌతికకాయంపై పూలదండ వేసి నివాళులు అర్పించారు. ఏళ్ల నాటి తమ స్నేహబంధాన్ని టీడీపీ పార్టీలో కలిసి పనిచేసిన జ్ఞాపకాలను తుమ్మల గుర్తుచేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, హేమంతరావు, గిడ్డంగులసంస్థచైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డి, టీడీపీ నాయకులు రామనాథం, కూరాపాటి వెంకటేశ్వర్లు, కొండబాల కోటేశ్వరరావు, కేతినేని హరీష్, నాగండ్ల లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ యర్రగర్ల హనుమంత రావు, కాపా ఆదినారా యణ, కుతుంబాక సీతారామ్, బానోత్ కిషోర్, రావెళ్ల శ్రీనివాస్, నరేశ్, వెంకటరమణ, నివాళులు అర్పించారు.



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

కొలిక్కి వచ్చిన బురద తొలగింపు

- ▸ వేగవంతమైన ఇంటింటి సర్వే
- ▸ తాగునీటి సరఫరా పునరుద్ధరణ చర్యలు
- ▸ క్లోరినేషన్ కార్యక్రమం షురూ

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 5: మున్నేరు వరద పోటుగా బురదమయంగా మారిన 13 డివిజన్లలో పారిశుధ్యం ఓ కొలిక్కి వస్తోంది. రెండు రోజులుగా వరుణుడు కరుణించి అడపాదడపా మినహా భారీ వర్షం కురవకపోవటంతో బాధితులు తమ నివాసాలను శుభ్రం చేసుకుంటున్నారు. మరోవైపు ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులు, జవాన్లు, ఇన్స్‌పెక్టర్లు ప్రాంతాల వారీగా పారిశుధ్య పనులు చేపట్టారు. ముఖ్యంగా మున్నేరు పరివాహక ప్రాంతంలో ఉన్న బొక్కలగడ్డ, వెంకటేశ్వరానగర్, పద్మావతినగర్, మోతినగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాలో పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతమైనాయి. ఇంటింటి సర్వే సైతం పుంజుకొంది. బాధితులకు ప్రభుత్వం అందించే నిత్యవసరాలు, దుస్తులు పంపిణీ షురూ అయ్యాయి.

బాధితుల గుర్తింపు సర్వే

మున్నేరు వరద బాధితులను గుర్తించేందుకు ఐదు విభాగాలు (కేటగిరి)గా అధికారులు సర్వే చేపట్టారు. ఇంటి చుట్టు నీళ్ల చేరితే కేటగిరి 1, ఇంటి కాంపాండ్‌లోకి నీళ్ల వస్తే 2, నీళ్ల ఇంటి లోపలికి వస్తే 3, ఇంటి లోపలికి నీళ్ల వచ్చి దుస్తులు పరికరాలు, వంట సామాన్లు, నిత్యవసరాలు, వస్తువులు తడిస్తే 4, ఇళ్ల నీటితో ధ్వంసమేతే 5వ కేటగిరిగా విభజన చేసి సర్వేను చేపట్టారు. మున్నేరు వరదలు, భారీ వర్షాలతో మొత్తం 10వేలకు పైగా నివాసాలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనాలు వేస్తున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని అన్ని ప్రాంతాలను కేటగిరి ఐదుగా గుర్తించే అవకాశం ఉంది. భారీ వర్షాలతో అలుగులుపడి నివాసాలకు మీదకు వరద చేరిన ఇతర ప్రాంతాలను 5వ కేటగిరిలో గుర్తించనున్నారు. ఇప్పటికే 6,400 నివాసాలు సర్వే పూర్తిచేశారు. ఇంకా 2వేలకు పైగా నివాసాలు సర్వే పూర్తి కావాల్సి ఉంది. శుక్రవారం వరకు సర్వే పూర్తి చేయాలని వేగవంతం చేశారు.



వీధుల వెంట బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికులు

ధ్రువపత్రాలు లేని వారికీ భరోసా

ఇళ్లలోకి వరద, వర్షపు నీరు రావటంతో బ్యాంకు అకౌంట్, ఆదార్, ఇతర ధృవపత్రాలు లేని వారికి ఇబ్బంది లేకుండా అధికారులు మార్గదర్శకాలను సరళీతరం చేశారు. బాధితులు తమ బ్యాంకు అకౌంట్ నెంబర్ చెప్పినా సరిపోతుంది. బ్యాంకు అకౌంట్ నెంబర్ కూడా చెప్పలేని వారి సెల్‌ఫోన్‌లో గుగుల్ పే, ఫోన్ పే పరిశీలించి సంబందిత బ్యాంకు ద్వారా బ్యాంకు ఖాతాలను గుర్తిస్తున్నారు.

కొలిక్కి వచ్చిన పారిశుధ్యం

మున్నేరు పరివాహక ప్రాంతంలో 13 డివిజన్లు భారీ వర్షాలకు మరో 5 డివిజన్లలో పారిశుధ్య సమస్యలు ఏర్పాడ్డాయి. ఖమ్మంతో పాటుగా నల్గొండ, వరంగల్ జిల్లాల నుంచి వచ్చిన పారిశుధ్య కార్మికులు రెండు రోజులుగా ప్రాంతాల వారీగా పని విభజన చేసి ముందుకు వెళ్లటంతో బురద తొలగింపు కొలిక్కి వచ్చింది. ఇళ్ల ముందు చెత్త, వీధుల్లో ఉన్న చెత్తను తొలగించారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీల చెత్తను సైతం తొలగించి బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ షురూ చేశారు. భవనాలు, గోడలు కూలీన ప్రాంతాలు, మేట వేసిన ప్రాంతాలను గుర్తించారు. 16, 35, 46, 47, 48 డివిజన్లలో పారిశుధ్య పనులు ఇంకా కొనసాగుతున్నాయి. మరో రోజు పట్టే అవకాశం ఉంది.



రోడ్లపై బురద తొలగిస్తున్న ఫైర్ సిబ్బంది

తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ఖమ్మం నగరానికి సాదారణ రోజుల్లో రోజుకు 68 మిలియన్ లీటర్లు నీళ్ల అవసరం ఉంటుంది. మున్నేరు వరద ప్రభావంతో మున్నేరు సమీపంలో ఉన్న డెడికేటెడ్ (24గంటల ఎక్స్‌ప్రెస్ ఫీడర్)ఫీడర్ ఫవర్ లైన్ కొట్టుకుపోయింది. దీంతో 39 మిలియన్ లీటర్లు పంపిణీ నష్టం వాటిల్లింది. దీంతో పాలేరు పంప్ హౌజ్ నుంచి మంచినీళ్లు తీసుకుంటున్నారు. ఇదే క్రమంలో రాజీవ్ స్వగృహ ప్రాంతంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్, మున్సిపల్ ఎస్ఈ రంజిత్ ప్రత్యేక చోరవతో నూతన కనెక్షన్‌ను ప్రారంభించారు. దీంతో మరో 17 ఎంఎల్‌టీ నీళ్ల పంపిణీ ప్రారంభమైంది. వీటితో మున్నేరు పరివాహక ప్రాంతంలోని 13 డివిజన్‌లకు రోజుకు రెండు సార్లు చొప్పున రహదారులు, నివాసాలు శుభ్రం చేసేందుకు అందిస్తున్నారు.

క్లోరినేషన్ షురూ

మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలు ఒక కొలిక్కి రావటంతో ఖమ్మం నగరంలోని పారిశుధ్య కార్మికుల్లో కొంతమందిని వారి రోజువారీ డివిజన్లకు విధులకు పంపారు. 16, 35, 46, 47, 48 డివిజన్లు మినహా మిగతా ప్రాంతాల్లో క్లోరినేషన్ షురూ చేశారు. బ్లీచింగ్‌తో పాటుగా దోమల మందును పిచికారి చేపట్టారు.

రాకాసితండాను సందర్శించిన అధికారులు


సమస్యలు తెలుసుకుంటున్న శ్రీజ

తిరుమలాయపాలెం,సెప్టెంబరు5:వరదలో నష్టపోయిన మండలంలోని రాకాసితండా, బంధంపల్లి గ్రామాలను వివిధశాఖల అధికారులు సందర్శించారు. ఆర్డీవో గణేష్, అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, శ్రీజ, డీఎంహెచ్‌వో సుబ్బారావు సందర్శించారు. యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలని, తెలిపారు. రోడ్లపై పడి ఉన్న వృక్షాలు, కూలిన గోడలు తొలిగించడం వంటి కార్యక్రమాలు చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, ఆర్ఐలు వీరయ్య, లహరి, విద్యుత్ డీఈ రవికుమార్ పాల్గొన్నారు.

డ్రెయినేజీలపై నిర్మాణాల తొలగింపు



సత్తుపల్లిరూరల్,ఆగస్టు5:సత్తుపల్లి పట్టణ పరిధిలోని డ్రెయినేజీలపై అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు తెలిపారు. గురువారం స్థానిక గౌతమ్ మోడల్ స్కూల్ రోడ్డులో ప్రహరీ గోడలతో పాటు ఫ్లోరింగ్ బిళ్లలను జేసీబీ సహాయంతో తొలగించారు. సమీపంలోని అర్బన్ పార్క్ నుంచి వచ్చే వరద ఎదురుగా ఉన్న ఖాళీ స్థలలో నిలుస్తున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఈ చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నయాబజార్ కళాశాలకు వరద పోటు

- రూ.50 లక్షల నష్టం, తడిచిన రికార్డులు
- 20 ఏళ్లలో మొదటిసారి కళాశాలలోకి వరద
- గతంలో పునరావాస కేంద్రంగా సేవలు

ఖమ్మంఖానాపురంహవేలీ, సెప్టెంబరు5: చదువుల కళామ్మ తల్లి, ఎందరో విద్యార్థులకు విద్యా బుద్దులు నేర్పిన సరస్వతీ నిలయం నయాబజార్ కళాశాల వరద పోటుకు గురైంది. ఆదివారం వచ్చిన భారీ వరదలకు 10 అడుగుల మేర నీరు చేరింది. తరగతి గదులు, ఆఫీస్‌రూం, కంప్యూటర్‌గది, ప్రిన్సిపాల్‌గది తదితర మొత్తం ప్రాంగణం వరదనీటితో నిండింది. కళాశాల స్థాపించి సుమారు 20 ఏళ్లు కాగా అప్పటి నుంచి ఖమ్మం నగరానికి ఎప్పుడు వరదలు సంభవించినా వరద బాధితులను నయబజార్ కళాశాల పునరావాస కేంద్రంగా ఆశ్రయం కల్పించింది. 500 వందల నుంచి 1000 మందికి పునరావాసం కల్పించేవారు. కళాశాల ప్రహరీ కూలి పోవటంతో


ఆఫీస్‌రూంలోకి బురదనీటిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

పాములు, తేళ్ల తదితర విషపురుగులు చేరి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ ప్రాంగణంలోనే నయబజార్ ప్రభుత్వ పాఠశాల ఉంది. పాఠశాలలోకి వరద నీరు చేరి గదులన్నీ బురదమయంగా మారాయి. ఆదివారం తెల్లవారుజామున వచ్చిన వరదలకు ఉదయం 7గంటల వరకు కళాశాలలోకి వరద నీరు రాలేదు. దీంతో ఇక్కడ వరద బాధితులకు కళాశాలలోనే పునరావాస కేంద్రంఏర్పాటు చేశారు. 9గంటల తరువాత వరదనీరు ఒక్కసారిగా పెరగటంతో కళాశాల మొత్తం వరదనీటితో నిండిపోయింది. దీంతో పునరావాస కేంద్రాన్ని గాంధీ చౌక్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు మార్చారు.

సుమారు రూ.50 లక్షల నష్టం
కేఎస్ రామారావు కళాశాల ప్రిన్సిపాల్



వరద కారణంగా రూ.50లక్షల నష్టం జరిగింది. కళాశాల రికార్డులు పూర్తిగా వరదలో తడిచాయి. కాంపౌండ్ వాల్ పూర్తిగా కూలిపోయింది. కళాశాల మొత్తం శుభ్రం చేయాలంటే ఇంకా నాలుగు రోజుల సమయం పడుతుంది. బ్లీచింగ్, శానిటేషన్, క్లోరినేషన్ చేయాల్సి ఉంది. మరోవారం రోజులు విద్యార్థులను అనుమతించ కుండా ఉంటే పరిస్థితులు చక్కబడతాయి.

కూలిన ఇళ్లపై నివేదిక

కారేపల్లి, సెపెంబరు5: మండల పరిధిలోని ఐదు గ్రామాల్లో నిరుపేదలకు సంబంధించిన ఐదు ఇళ్లు కూలిపోయాయి. అలాగే పేరుపల్లి గ్రామంలోని 20 డబుల్ బెడ్ ఇళ్లలోకి వరదనీరు చేరడంతో వాటిలోని నిత్యవసర వస్తువులు, దుస్తులు తడిపోయాయి. బాధితులకు ఆర్థికసాయం అందించేందుకు నివేదికలు పంపామని తహసీల్ధార్ సంపత్‌కుమార్ తెలిపారు.

వరద ప్రాంతాల్లో పాముల భయం..

ఖమ్మంసాంస్కృతికం,సెప్టెంబరు 5: వరద ప్రాంతాల్లో విషసర్పాల భయం వెంటాడుతుండటంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు..కాల్వొడ్డు ప్రాంతంలోని బొక్కలగడ్డ, మోతి నగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతి నగర్, తదితర ప్రాంతాల్లో మున్నేటి వరదకు పాములు, తేళ్ల వంటివి కొట్టుకు రావటంతో అవి ఇళ్లల్లోకి చేరాయి.. వరద భయంతో బాధితులు ఇళ్ల విడిచి వెళ్లారు. వరద తగ్గి పోవటంతో ఇళ్లకు చేరి శుభ్రం చేసుకునే పనుల్లో ఉండగా విషపురుగుల సంచారం వేధిస్తోంది.. రెండు రోజుల క్రితం కొండచిలువ ప్రత్యక్షం కావటంతో హడలి పోయిన స్థానికులు పరుగులు తీశారు.


కేవీపీఎస్ ఆధ్వర్యంలో పాల ప్యాకెట్ల పంపిణీ..


సీపీఎం కార్యాలయంలో సిద్ధమవుతున్న కిట్లు


జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో...


సరుకులు ఇస్తున్న కార్పొరేటర్ విజయవెంకటరమణ


లచ్చగూడెంలో విరాళాలు సేకరిస్తున్న యువకులు


ఎస్‌బీఐటీ కళాశాలలో

కొనసాగుతున్న దాతృత్వం

ఖమ్మంసాంస్కృతికం,సెప్టెంబరు5:వరద బాధితులకు సేవా కార్యక్రమాలు గురువారం సైతం కొనసాగాయి. సరుకులు, దుస్తులు, పండ్లు, బ్రెడ్లు వంటి తోచిన సాయాలతోపాటు అన్నదానాలు, పులిహోర పొట్లాల పంపిణీ చేశారు. సీపీఎం అర్బన్‌కమిటీ ఆధ్వర్యంలో, గ్రేస్ సర్వీస్‌సొసైటీ ఆధ్వర్యంలో, కేవీపీఎస్ ఆధ్వర్యంలో, పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, శ్రీలక్ష్మీబాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో, జమాతే ఇస్లామీహింద్ ఆధ్వర్యంలో విరాళాలు అందించారు.

రూ.25 వేలు విరాళం


చెక్కును అందిస్తున్న స్కూల్ యాజ మాన్యం

కల్లూరు:ఖమ్మంవరద బాధితుల సహాయార్థం కల్లూరులోని బాలాజీ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ వంతుగా రూ. 25 వేలు విరాళంగా అందించారు. గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సదరు పాఠశాల కరస్పాండెంట్ వలసాల బాలాజీ, హెచ్‌ఎం నరేంద్రకుమార్, ఉపాధ్యాయులు ఖమ్మంలో చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సత్తిరెడ్డి, ఉపాధ్యాయులు నరేష్, సిహెచ్ కిరణ్, రాజా పాల్గొన్నారు.


భద్రాద్రి బ్యాంకు ఆధ్వర్యంలో..


అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కందాళ


గ్రానైట్ ట్రేడర్స్ మార్చర్స్ ఆధ్వర్యంలో..


సీపీఎం అర్బన్ కమిటీ ఆధ్వర్యంలో..


సయ్యద్ మదర్‌సాబ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో


గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో

దైవచింతన.. పర్యావరణ పరిరక్షణ

- 15ఏళ్లుగా మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న కాకతీయ షుగర్స్ యాజమాన్యం
- కల్లూరులో భక్తులకు నేటినుంచి ఉచితంగా విగ్రహాల పంపిణీ

కల్లూరు,సెప్టెంబరు5: దైవచింతనతో పాటు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కల్లూరులోని శ్రీకాకతీయ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ముందుకు సాగుతోంది. ఏటా వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాల కారణంగా వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. ఈనేపథ్యంలో షుగర్‌ఫ్యాక్టరీ యాజమాన్యం పర్యావరణ హితం కోరుతూ మట్టి విగ్రహాలను తయారు చేసి ఉచితంగా అందజేస్తోంది. ఐదు రోజుల క్రితం నుంచి కాకతీయ ఫ్యాక్టరీ ప్రాంగణంలో యాజమాన్యం వారు


విగ్రహాలను తయారు చేస్తున్న దృశ్యం

ఈవిగ్రహాలను తయారు చేయిస్తున్నారు. ఐదు రోజుల క్రితం నుంచి నేటి వరకు 1000 విగ్రహాలను తయారు చేసి సిద్ధంగా ఉంచారు. ఆరు అంగుళాల ఎత్తు, నాలుగు అంగుళాల వెడల్పుతో ఈ విగ్రహాలను తయారు చేశారు. ఇవి చిన్నపాటి సైజులో ఉంటాయి. ప్రతి కుటుంబంలో భక్తులు ప్రతిష్ఠాపనలు చేసేలా, ఆధ్యాత్మిక భావన కలిగించేలా ఈ విగ్రహాలను తయారు చేశారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం
ప్లాంట్ ఇంజనీర్ కోడాలి రఘునాథబాబు



పరావరణాన్ని కాపాడే క్రమంలో స్ఫూర్తిదాయకంగా తీసుకొని తమ ఫ్యాక్టరీలో 15 సంత్సరాల కిత్రం నుంచి మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. రసాయనాలతో చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు ఉంది. చెరువులలో, మంచినీటి ప్రాజెక్టులలో రసాయన విగ్రహాలను నిమజ్జనం కారణంగా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. అందుకే మట్టి విగ్రహాలను నిమజ్జనం చేస్తే తొందరగా కరిగి పోతాయన్నారు. ఇలా ఏటా వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని 1000 వినాయక మట్టి విగ్రహాలను ఉచితంగా అందిస్తున్నాం. పర్యావరణ పరిరక్షణేధ్యేయంగా తాము ముందుకు సాగుతున్నామని చెప్పారు.

ఎంపీ అన్నదానం

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు5: రామ సహాయం అనసూయమ్మ జయంతి సందర్భంగా ఆమె మనుమడు ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రామ సహాయం రఘురాం రెడ్డి గురువారం నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్‌లో అన్నదానం చేశారు. 225 మందికి అన్నదానం చేశారు. అనాథలకు అన్ని విధాలుగా అండగా ఉంటాఅని భరోసా కల్పించారు. అన్నం శ్రీనివాసరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, న్యాయవాది స్వామి రమేష్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


భోజనం వడ్డిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

రేషన్ బియ్యం పట్టివేత

కామేపల్లి, సెప్టెంబరు5: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన కామేపల్లి మండలంలోని టేకులతండాలో గురువారం చోటు చేసుకుంది. విశ్వనాథపల్లికి చెందిన గుడివాడ చరణ్ 43క్వింటాల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పక్క సమాచారంతో స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వ్యాన్‌తో సహ కామేపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కామేపల్లి పోలీసులు గుడివాడ చరణ్ తోపాటు మరో నలుగురుపై కేసు నమోదు చేసినట్లు కామేపల్లి ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

వైరా,సెప్టెంబరు5:వైరాలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మునిసిపాలిటీ పరిధిలోని పలువురికి కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 12 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను, 55మంది బాధితులకు రూ.17లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఇటీవల వరదల్లో మృతిచెందిన వారికి సంతాప సూచికంగా మౌనం పాటించారు. తహసీల్దార్ కేవీ. శ్రీనివాసరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, ఏదునూరి సీతరాములు, పమ్మి అశోక్, రాంపూడి రోశయ్య, ధార్న రాజశేఖర్, కన్నెగంటి హుస్సేన్, చప్పిడి వెంకటేశ్వరరావు, బొళ్ల గంగారావు, బత్తుల శ్రీను, కర్నాటి హన్మంతరావు, కోసూరి శ్రీను, వాంకుడోతు బీక్యా, పాలేటి నర్సింహారావు పాల్గొన్నారు.

త్రీటౌన్ స్టేషన్ ఎదుట స్వల్ప ఉద్రిక్తత

ఖమ్మంక్రైం,సెప్టెంబరు 5: నగరంలోని మాజీకార్పొరేటర్ మాటేటి నాగేశ్వరరావును స్టేషన్‌కు రావాలని త్రీటౌన్ పోలీసులు పిలవడంతో గురువారం స్టేషన్ ఎదుట స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. నగరంలోని బొక్కలగడ్డ ప్రాంతంలో మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పనులు చేస్తుండగా ఒక్కో కుటుంబానికి లక్షరూపాయలు నష్టపరిహారం చెల్లించాలంటూ మాటేటి డిమాండ్ చేస్తూ సిబ్బందిని అడ్డుకున్నారు. సిబ్బంది మున్సిపల్ కార్పొరేషన్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన త్రీటౌన్ పోలీసులకు తెలిపారు. వారు మాజీకార్పొరేటర్‌ను స్టేషన్‌కు పిలిపించారు. మాట్లాడి పంపేశారు. విషయం తెలుసుకున్న ఆయన అనుచరులు స్టేషన్ వద్దకు చేరుకుని ఘర్షణకు దిగారు. స్టేషన్ వద్ద స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. అనంతరం అరెస్ట్ చేయలేదని పోలీసులు తెలిపి వారందరిని అక్కడినుండి పంపించి వేశారు.

ప్రయాణికులను సన్మానించిన డీఎం


పద్మకుమారిని సన్మానిస్తున్న డీఎం రాజ్యలక్ష్మీ

సత్తుపల్లి, ఆగస్టు5: 19ఏళ్లుగా ఆర్టీసీలో ప్రయాణిస్తున్న ఐ.పద్మకుమారిని సత్తుపల్లి డీఎం యూ.రాజ్యలక్ష్మీ సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డిపోలో ఉపాధ్యాయులకు గులాబీలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎస్ఎం చంద్రరావు, వీటీవో కిన్నెర ఆనందరావు, టీఐత్రి పీ.సుబ్బారావు, ఏడీసీలు బాలస్వామి, వెంకటయ్య, తిరుపతయ్య, డీఐ ప్రభాకర్, ఇబ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణా ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడికి మాతృ వియోగం

నేలకొండపల్లి, సెప్టెంబరు5: మండల పరిధిలోని కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన తెలంగాణా ఉద్యమ కారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాస రావు తల్లి సోమలక్ష్మి(80)గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆమె కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. సోమలక్ష్మి మృతి సమాచారం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ఖమ్మంటౌన్, సెప్టెంబరు5:ఎంపీ వద్దిరాజు రవిచంద్ర 20మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఖమ్మం నగరం, పరిసర మండలాలు,గ్రామాలకు చెందిన 20మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా 5లక్షల 85వేల రూపాయలు మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన చెక్కులను గురువారం సాయంత్రం ఖమ్మం బుర్హాన్ పురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎంపీ వద్దిరాజు అందించారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న వారంతా ఎంపీ రవిచంద్రకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

22న జూబ్లీక్లబ్ ఎన్నిక

ఖమ్మంస్పోర్ట్స్, సెప్టెంబరు5: నగరంలోని జూబ్లీక్లబ్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడానికి రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఈనెల 22న ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుత పాలకవర్గం గడువు ఏడాది క్రితమే ముగిసింది. 6నెలలకు ఒకసారి పొడిగిస్తూ పాలకవర్గ సమావేశంలో సభ్యులు తీర్మానం చేస్తూ వచ్చారు. కాగా జూబ్లీక్లబ్‌కు ఎన్నికలు నిర్వహించాలని మెజారిటీ సభ్యులు డిమాండ్ చేస్తుండటంతో ఎన్నికల తేదీలు ఖరారు చేసినట్లు తెలిసింది.సుమారు 3వేలమంది సభ్యులు ఓటు హక్కు వినియోగించనున్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడు వెంకటేశం మృతి

నేలకొండపల్లి, సెప్టెంబరు5: మండల పరిధిలోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు వంగూరి వెంకటేశంమాదిగ(80) గురువారం తెల్లవారుఝామున మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వంగూరి ఆనందరావు, పగిడికత్తుల ఈదయ్య నివాళులర్పించారు.

పంటలను పరిశీలించిన ఏవో

కొణిజర్ల,సెప్టెంబరు5:మండలంలోని అంజనాపురం, గద్దలగూడెం, మల్లుపల్లి గ్రామాలలోని దెబ్బతిన్న పంటలను ఏవో బాలాజీ పరిశీలించారు. వర్షాలను వలన దెబ్బతిన్న పంటలను ఏఈవోలు పరిశీలిస్తున్నారని తెలిపారు.

తగ్గి స్వల్పంగా పెరిగిన వైరా నీటిమట్టం

వైరా, సెప్టెంబరు 5: వైరా రిజర్వాయర్ నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. గురువారం సాయంత్రానికి 19.2అడుగులకు నీటిమట్టం చేరుకుంది. బుధ వారం 18.9అడుగులకు తగ్గిన నీటిమట్టం రాత్రికి 19.2అడుగులకు చేరుకుంది.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఏన్కూరు, సెప్టెంబరు5: రైతువేదికలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో ప్రయాణించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గురుకుల పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

కిష్టారంలో కూలిన ఇంటిగోడ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు5: ఇటీవల కురిసిన వర్షాలతో పాటు సింగరేణి బాంబ్ బ్లాస్టింగుల కారణంగా పెంకుటిల్లు గోడ కూడ కూలిన సంఘటన గురువారం మండలంలోని కిష్టారంలో చోటుచేసుకుంది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మునగాల రాములు ఇల్లు మధ్యాహ్నం 3గంటల సమయంలో కూలిందని, తమకు ప్రభుత్వమే న్యాయం చేయాలంటూ బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గడిచిన 2నెలల వ్యవధిలో ఇది రెండవ సంఘటన అని, వెంటనే తమకు పునరావాసం కల్పించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

విపత్కర సమయంలో దాతృత్వాన్ని చాటండి

ఖమ్మంరూరల్,సెప్టెంబరు5: విపత్కర సమయంలో దాతలు ఆదుకోవాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. మండల పరిధిలోని కస్నాతండాలో వరద బాదితులకు 250 మందికి గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఖమ్మం జీవీ మాల్ సహకారంతో బాదితులకు దుస్తులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేస్, గోవిందరావు, అజ్మీర రాంమూర్తి, భాస్కర్‌రావు, రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.